# సాక్షి వరంగల్

శనివారం । 3 । ఆగస్టు । 2024






**లక్నవరం..మరింత కనువిందు**

పర్యాటకులకు మరింత కనువిందు చేసేలా లక్నవరం అడవిలో నైట్ క్యాంపింగ్ సైట్ ఏర్పాటు చేయనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. - 8లో▸



**ఏసీబీకి పట్టుబడిన పర్వతగిరి ఎస్సై**

లంచం తీసుకుంటుండగా పర్వతగిరి ఎస్సై గుగులోత్ వెంకన్నను శుక్రవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$30^0/25^0$

**వాతావరణం**

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత వర్షం కురుస్తుంది. సాయంత్రం వేళ ఆహ్లాదకరంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### కలెక్టర్‌ను కలిసిన స్టాటిస్టికల్ సెక్షన్ ఆఫీసర్లు



కాళోజీ సెంటర్: హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న 20 మంది సెంట్రల్ ట్రెయినీ అసిస్టెంట్ స్టాటిస్టికల్ సెక్షన్ ఆఫీసర్లు శుక్రవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారదను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెంట్రల్ ట్రెయినీ అసిస్టెంట్ స్టాటిస్టికల్ సెక్షన్ ఆఫీసర్లు జూలై 29 నుంచి ఆగస్టు 2 వరకు జిల్లాలోని పలు మండలాలను సందర్శించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఈటీసీ ప్రిన్సిపాల్ మల్లేశం పాల్గొన్నారు.

### దీప్తిని ఆదుకోవాలి

పర్వతగిరి: మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన క్రీడాకారిణి జీవంజి దీప్తిని ప్రభుత్వం ఆదుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అథ్లెటిక్‌లో జాతీయ, అంతర్జాతీయస్థాయి పతకాలు సాధించి పారిస్‌లో జరుగనున్న పారా ఒలింపిక్స్‌లో దీప్తి పాల్గొననుందని తెలిపారు. పేద కుటుంబానికి చెందిన ఆమెను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### 8న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

కాళోజీ సెంటర్: గల్ఫ్ దేశాలతోపాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్, రుమేనియా, యూకే తదితర దేశాల్లో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపనీ లిమిటెడ్ (టాంకాం) ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందని జిల్లా ఉపాధి కల్పన అధికారి సీహెచ్.ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు వరంగల్ ములుగు రోడ్డులోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఈనెల 8న జరిగే ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు హాజరుకావాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు 8125251408 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.


### అంతర్జాతీయస్థాయి యూత్ స్పోర్ట్స్ మీట్‌కు ఉదయ్

నర్సంపేట రూరల్ : గోవాలో ఇటీవల జరిగిన 18వ జాతీయస్థాయి యూత్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ గేమ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నర్సంపేట మండలంలోని ఇప్పల్‌తండా వాసి ధరావత్ ఉదయ్ ప్రతిభ కనబరిచాడు. లాంగ్ జంప్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఉదయ్ బాసర ట్రిపుల్ ఐటీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదుతున్నాడు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆయన అంతర్జాతీయస్థాయి పోటీలకు మనదేశం తరఫున అర్హత సాధించాడు. నేపాల్ దేశంలోని పోకార పట్టణంలో సెప్టెంబర్ 1 నుంచి 6వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ పోటీల్లో నేషనల్ యూత్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ ఇండియా తరఫున పాల్గొంటాడు

### పలువురు సీడీపీఓల బదిలీ

కాళోజీ సెంటర్: జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీడీపీఓలు బదిలీ అయ్యారు. వరంగల్ సీడీపీఓ ఎం.విశ్వజ హనుమకొండ అర్బన్ సీడీపీఓగా, ఆమె స్థానంలో నర్సంపేట ఏసీడీపీఓ పి.విద్యను వరంగల్ ప్రాజెక్టు సీడీపీఓగా బదిలీ చేశారు. ములుగు జిల్లా ఏటూరునాగారం ఏసీడీపీఓ వి.హేమలతను నర్సంపేట ఏసీడీపీఓగా బదిలీ చేశారు. హనుమకొండ అర్బన్ సీడీపీఓగా పనిచేస్తున్న కె.మధురిమ నర్సంపేట ఏసీడీపీఓగా బదిలీపై వెళ్లారు.

### గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములు ఇవ్వం



సంగెం: గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం మూడు పంటలు పండే వ్యవసాయ భూములు ఇవ్వమని సంగెం మండలంలోని పలు గ్రామాల రైతులు తేల్చి చెప్పారు. జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా కార్యాలయానికి వెళ్లి శుక్రవారం వినతిపత్రం అందించారు. అనంతరం తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యాలయానికి వెళ్లగా ప్రొఫెసర్ కోదండరాం లేకపోవడంతో వెనుదిరిగారు. అసెంబ్లీ ముట్టడికి యత్నించగా కుదరకపోవడంతో తమ డిమాండ్లతో కూడిన బ్యానర్‌తో సెక్రటేరియట్ ఎదుట ధర్నా చేశారు. పోలీసులు రైతులను కార్ఖానా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నిర్వాసిత రైతులు మాట్లాడుతూ ఎకరాకు రూ.10 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు మాదినేని రాంరెడ్డి, వేల్పుల రాజు, దానం సురేశ్‌కుమార్, కుప్పాల రాజేందర్, పెద్దపల్లి రాజ్‌కుమార్, రొట్టె వెంకటేశ్వర్లు, ఓదెల కుమారస్వామి, జాటోత్ మిట్టు, సంధ్యారాణి పాల్గొన్నారు.

# నిధులు.. వసతులున్నా నిర్లక్ష్యమే

**ఉమ్మడి వరంగల్ జిల్లా పరిస్థితులపై 'కాగ్'**

- మొత్తంగా ప్రజారోగ్యాన్ని పట్టించుకోలే..
- పీహెచ్ఐఎంఎస్‌పై పెదవి విరుపు
- పంచాయతీరాజ్, మున్సిపాలిటీల నిధులు పక్కదారి
- పొంతనలేని ఆదాయం, వ్యయాలపై అభ్యంతరం
- చర్చనీయాంశంగా కంప్ట్రోలర్ ఆడిట్ జనరల్ నివేదిక



సాక్షిప్రతినిధి, వరంగల్:

అసెంబ్లీలో 2023 మార్చితో ముగిసిన ఏడాది స్థితిగతులపై శుక్రవారం విడుదల చేసిన కంప్ట్రోలర్ ఆడిట్ జనరల్ (కాగ్) నివేదికలో ఉమ్మడి వరంగల్ అంశాలు చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర జీఎస్‌డీపీ 2021–22తో పోలిస్తే 2022–23లో 16 శాతం పెరిగిందని పేర్కొన్న ఈ నివేదికల్లో ఉమ్మడి జిల్లాలో 'పబ్లిక్ హెల్త్, మేనేజ్‌మెంట్ హెల్త్ సర్వీసెస్'పై పెదవి విరిచింది. 2020–21 పంచాయతీరాజ్ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, వ్యవసాయ మార్కెట్ కమిటీల లావాదేవీలపై అభ్యంతరాలను వ్యక్తం చేసింది. దళితబంధు, రుణమాఫీ, ఇళ్లు, గొర్రెల పంపిణీ, ఆయిల్‌పామ్, సాగునీరు, తాగునీటి పథకాలను కూడా 'కాగ్' విశ్లేషించింది.

**ప్రజారోగ్యంపై పెదవి విరుపు...**

కోవిడ్, ఇతర సమయాల్లో ప్రభుత్వ ఆస్పత్రులకు నిధులు, సౌకర్యాలున్నా పలుచోట్ల సద్వినియోగం చేసుకోలేదని 'కాగ్' తన నివేదికలో పేర్కొంది. డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఫార్మసిస్టుల కొరతను సూచించింది. కోవిడ్ సమయంలో ప్రభుత్వం రూ.14.65 కోట్ల ఖర్చుతో 14 జిల్లా కేంద్రం ఆస్పత్రులకు విలువైన పరికరాలను సరఫరా చేయగా, వీటిలో రూ.5.75 కోట్ల విలువైన పరికరాలను 8 చోట్ల ఉపయోగించలేదని పేర్కొంది. ములుగు జిల్లా ఆస్పత్రిలో రూ.1.44 కోట్ల విలువ చేసే 15 స్టాండ్‌లతో కూడిన కోట్స్ పోలర్ పిడియాట్రిక్ ఐసీయూ యూనిట్లను ఉపయోగించకుండా ఉంచారు. స్థలం లేకపోవడం మూలంగా ఖాళీగా నర్సంపేట ఆస్పత్రిలోనూ రూ.1.28 కోట్ల విలువైన పరికరాల వినియోగంలో ఇదే పరిస్థితిని 'కాగ్' పేర్కొంది. కోవిడ్ సమయంలో ప్రభుత్వం 10 లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ (ఎల్ఎంఓ)లను సమీకరించినా ఎనిమిది ప్రధాన ఆస్పత్రుల్లో వినియోగించలేదని ఆక్షేపించింది. ఇతర రాష్ట్రాల నుంచి ఏప్రిల్ 2022లో లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్‌ను సరఫరా చేయడానికి నిల్వ ట్యాంకులుగా ఉపయోగించాల్సినవి కంటైనర్ల ఆవరణలో పడి ఉన్నాయని పేర్కొంది. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జీజీహెచ్‌ల తోపాటు ఎనిమిదింటిలో వరంగల్ పీఎంఎస్ఎస్‌వై ఆస్పత్రి కూడా ఉన్నట్లు కాగ్ స్పష్టం చేసింది.

**నిధుల వినియోగంపై అభ్యంతరాలు..**

⊃ వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల గ్రామ పంచాయతీకి సంబంధించిన ఆడిట్ పరిశీలనలో రూ.8,77,137 వివిధ పన్నుల కోసం గ్రామ పంచాయతీ ద్వారా వసూలు చేసినట్లు తేలగా, ఈ మొత్తాన్ని గ్రామ పంచాయతీ నిధులకు జమచేయలేదు. ఆడిట్ ముగిసే వరకు కూడా ఈ మొత్తాన్ని చేతి నిల్వగా చూపించారు. నిబంధనల ప్రకారం సేకరించిన మొత్తాన్ని రోజువారీ సేకరణ పుస్తకం, చిట్టా, నగదు పుస్తకంలో నమోదు చేయాలి, తర్వాత ట్రెజరీ పాస్ పుస్తకంలో చూపాలి. కానీ, ఆ మొత్తాన్ని జమ చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జీఓ ఎంఎస్ నం.33 ఫైనాన్స్ (టీఎఫ్ఆర్ 1) నిబంధనల ఉల్లంఘన కింద డిపార్ట్‌మెంట్ ప్రకారం వసూలు చేసిన మొత్తాన్ని గ్రామ పంచాయతీ నిధులకు జమ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని కాగ్ రిపోర్టులో ఆదేశించింది. ఆర్థిక (టీఎఫ్ఆర్) శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం గ్రామ పంచాయతీలతో సహా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వం ముందస్తు అనుమతి లేనిదే ఫర్నిచర్ కొనుగోలు చేయరాదు. కాగా 2020–2021 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీ నిధుల నుంచి సెల్ఫ్ చెక్ ద్వారా రూ.52,475 విలువైన ఫర్నిచర్ కొనుగోలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ కొనుగోళ్లకు అయిన మొత్తంపై ఆడిట్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు.

⊃ 2020–21 సంవత్సరానికి గాను నెక్కొండలోని అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఖాతాలపై ఆడిట్ సమయంలో గోడౌన్లను సీసీఐ, ఇతర వ్యాపారులకు అద్దె ప్రాతిపదికన కేటాయించినట్లు గుర్తించారు. కానీ, 2019–20 సంవత్సరానికి ఎలాంటి మొత్తం వసూలు కాలేదు. దీని వల్ల రూ.44,41,522 వసూలు చేయాలి. సీసీఐ ఇతర ట్రేడ్ సంస్థల నుంచి బకాయి ఉన్న రూ.44,41,522ను వసూలు చేయడానికి తక్షణమే చర్య తీసుకుని, ఆ డబ్బును నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులకు జమచేయాలని ఆడిట్ రిపోర్టులో ఆదేశించారు.

⊃ నర్సంపేట మున్సిపల్ కౌన్సిల్ ఆడిట్ సందర్భంగా ఏడాది కాలంలో పలు పనులు చేపట్టి చెల్లింపులు చేశారు. ఎగ్జిక్యూటివ్ అథారిటీ ఆఫ్ మార్జిన్ లెటర్‌లు, మౌఖిక అభ్యర్థనలను అందించిన తర్వాత కూడా ఆడిట్ చేయడానికి ఎం (ఎంబుక్) పుస్తకాలు, ఫైల్‌లను అందించలేదు. దీంతో ఖర్చు చేసిన మొత్తం రూ.2,46,86,277పై అభ్యంతరం వ్యక్తం చేశారు. ధ్రువీకరణ కోసం ఆడిట్ చేయడానికి కొలత పుస్తకాలు, ఫైళ్లను సమర్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని, అప్పటి వరకు రూ.2,46,86,277 అభ్యంతరం కిందనే ఉంటాయని పేర్కొంది.

# వివాదంలో బాల రక్షాభవన్!

- ఇప్పటికే దత్తత నిబంధనల ఉల్లంఘనపై విచారణ
- నెలలు గడుస్తున్నా చర్యలు శూన్యం
- తాజాగా ఇన్‌చార్జ్ డీసీపీఓపై హెల్ప్‌లైన్ ఉద్యోగుల ఫిర్యాదు
- విచారణ చేపట్టిన డీడబ్ల్యూఓ, జిల్లా పరిషత్ సీఈఓ



బాల రక్షాభవన్ కార్యాలయం

సాక్షి, వరంగల్: జిల్లా బాలల సంరక్షణ విభాగం వివాదానికి కేరాఫ్‌గా నిలుస్తోంది. ఇప్పటికే పిల్లలు దత్తత తీసుకునే దంపతుల విషయంలో నిబంధనలు అతిక్రమించారనే ఫిర్యాదులపై విచారణ జరుగుతోంది. ఇదిలా ఉండగానే బాల రక్షాభవన్‌కు ఇన్‌చార్జ్ డీసీపీఓ రాత్రి వేళ వస్తుండడంతో తాము ఇబ్బంది పడుతున్నామంటూ చైల్డ్‌లైన్ ఉద్యోగులు జిల్లా సంక్షేమ విభాగాధికారికి ఫిర్యాదు చేయగా విచారణ జరుగుతోంది. ఫిర్యాదుదారులతోపాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు ఇన్‌చార్జ్ డీసీపీఓకు మెమోలు జారీచేశారు. డీడబ్ల్యూఓ ఓవైపు విచారణ చేస్తుండగానే.. ఇప్పుడు కలెక్టర్ సత్య శారదకు హెల్ప్‌లైన్ ఉద్యోగులు మళ్లీ ఫిర్యాదు చేయగా జెడ్పీ సీఈఓ రాంరెడ్డిని విచారణాధికారిగా నియమించారు. దీనిపై సాధ్యమైనంత తొందరగా విచారణ చేసి సదరు నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నారు. ఇటు జిల్లా సంక్షేమ విభాగాధికారి, అటు జెడ్పీ సీఈఓ ఇచ్చే నివేదికల ఆధారంగా చర్యలు ఉండనున్నాయి.

**చర్యల విషయంలో ఎందుకు ఆలస్యమంటే...**

రాయపర్తి మండలానికి చెందిన మురుపోజు రాంబాబు–సవిత దంపతులు, వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బొమ్మిడి నర్సయ్య–దంపతులు దత్తత విషయంలో సదరు విభాగాధికారి నిర్లక్ష్యంతో సీనియార్టీ కోల్పోయామని మే, జూన్ నెలలో ఫిర్యాదు చేస్తే కలెక్టర్ విచారణ జరిపించారు. బాధితుల వాంగ్మూలం ఆధారంగా వారికి తిరిగి దత్తత వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. అయితే, చట్టాలను తుంగలో తొక్కిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. అయితే, ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మంత్రి ఆదేశాలతోనే చర్యలు తీసుకునే విషయంలో వెనుకడుగు వేశారనే టాక్ ఉంది. ఒక దత్తత విషయమే కాదు.. సదరు అధికారి ఉద్యోగంలో చేరినప్పుడు సమర్పించిన అనుభవపత్రం అసలైందికాదని వచ్చిన ఫిర్యాదు, వరంగల్‌లో ఉద్యోగం వచ్చిన సమయంలో గతంలో పనిచేసిన జిల్లా బాలల సంరక్షణ విభాగంలో ఉద్యోగానికి రాజీనామా చేసి, మహిళా శిశు సంక్షేమ శాఖలో కమిషనర్ ఉత్తర్వులు లేకుండా ఫర్ కమిషనర్ అంటూ ఓ లెటర్ తెచ్చుకొని కలెక్టర్‌నే బురిడీ కొట్టించారనే విషయాలపై విచారణ జరుగుతోంది. దీంతో సదరు అధికారిపై చర్యల విషయంలో ఆలస్యం అవుతుందనే మరో వాదన వినిపిస్తోంది. ఇదిలా ఉండగానే ఇన్‌చార్జ్ డీసీపీఓ అసభ్యంగా వ్యవహరిస్తున్నారంటూ చైల్డ్‌లైన్ ఉద్యోగులు ఫిర్యాదు చేయడంతో బాల రక్షాభవన్ మరోసారి వివాదంలోకి వచ్చింది. సదరు చైల్డ్‌లైన్ ఉద్యోగుల్లో ఒకరు సెలవు దినాలు, పండుగ రోజుల్లో రాకున్నా సంతకాలు ఎందుకు చేశారని అడిగానని, వారితో అసభ్యంగా వ్యవహరించలేదని ఇన్‌చార్జ్ డీసీపీఓ వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. కాగా, దీనిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు.

# నెక్కొండలో గంజాయి పట్టివేత



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

నెక్కొండ: మండల కేంద్రంలో పోలీసులు శుక్రవారం గంజాయి పట్టుకున్నారు. నెక్కొండ సీఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని తానే జిల్లాకు చెందిన పుష్కర్ హరిదాస్ నుంచి సుమారు 5.507 కిలోల (రూ.1.40 లక్షల విలువైన) ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సమీర్ సుమన్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి, రైలు మార్గంలో హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశామన్నారు. చెన్నారావుపేట ఎస్సై అరుణ్, పోలీసులు పాల్గొన్నారు.

# 5 నుంచి 'స్వచ్ఛదనం-పచ్చదనం'


- కలెక్టర్ డాక్టర్ సత్య శారద



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సత్య శారద

కాళోజీ సెంటర్: జిల్లాలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అటవీశాఖ అధికారి అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు రోజులపాటు జరుగనున్న ఈ కార్యక్రమాన్ని మండలస్థాయిలో జిల్లా పరిషత్ సీఈఓ, డీఆర్డీఓ, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలు, ప్రాథమి ఆరోగ్య కేంద్రాలు, బస్టాండ్లలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తూ మురుగు కాల్వలను శుభ్రం చేయించాలన్నారు. నీటి సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, నిర్ణీత మోతాదులో క్లోరినేషన్ చేయాలని, 300 చదరపు గజాల ప్లాటు ఉన్న భవనాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని చెప్పారు. స్వచ్ఛదనం–పచ్చదనంపై విద్యార్థులకు వ్యాసరచన, పద్యగేయాల పోటీలు నిర్వహించి బహుమతులను అందించి ప్రోత్సహించాలని కలెక్టర్ డీఈఓకు సూచించారు. వన మహోత్సవం కింద మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించాలని సూచించారు. డీఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సమ్మేళనానికి తరలిన ఉపాధ్యాయులు



బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్య శారద

కాళోజీ సెంటర్: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా నుంచి పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు తరలివెళ్లారు. ఉపాధ్యాయులను తరలించేందుకు విద్యాశాఖ ఏర్పాటు చేసిన బస్సులను కలెక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 13 మండలాల్లోని మైనార్టీ, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదోన్నతి పొందిన సుమారు 634 మంది ఉపాధ్యాయులు సీఎం సభకు క్షేమంగా వెళ్లి తిరిగి వచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఈఓ వాసంతి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్, సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, డీసీఈబీ అధికారి గారె కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పాల ఉత్పత్తి పెంచాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దయాకర్

చెన్నారావుపేట: పాల ఉత్పత్తి పెంచి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మునిగాల దయాకర్ సూచించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు పాడి గేదెల కొనుగోలు కోసం సెర్ప్ ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి గేదెల కొనుగోలు కోసం మహిళా సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మండల పశువైద్యాధికారి మంజీలాల్, ఏపీఎం ఈశ్వర్ మాట్లాడుతూ పాల ఉత్పత్తి పెంచడంతోపాటు మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు. పాడి గేదెలకు వేయించాల్సిన వ్యాక్సిన్లు, జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గేదెలు, గొర్రెలు, కోళ్ల పెంపకందారులకు షెడ్డు సౌకర్యం, పశుగ్రాసం పెంపకం కోసం రాయితీ పథకాలు ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిని స్మిత, ఈసీ కిశోర్, సీసీలు కట్టయ్య, మంజుల, సుజాత, శ్రీలత, శ్రీనిధి, మేనేజర్ ఫిర్దోష్, వీఓఏలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఎన్ఎంసీ గ్రీన్‌సిగ్నల్

- నర్సంపేటలో వైద్య కళాశాలకు పచ్చజెండా
- 50 సీట్లతో ప్రారంభించేందుకు అధికారుల సన్నాహాలు
- ఈనెల 24న కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు



నర్సంపేటలోని వైద్యకళాశాల భవనం

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని వైద్య కళాశాలకు ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గతంలో జాతీయ వైద్యమండలి తనిఖీలు చేపట్టింది. సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఈ ఏడాది తిరస్కరిస్తున్నట్లు తెలిపింది. దీంతో కలెక్టర్ సత్యశారద, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షించారు. ఈక్రమంలో ఈఏడాది వైద్య కళాశాలను 50 సీట్లతో ప్రారంభించాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగారు. అన్ని అడ్డంకులను అధిగమించి ఈనెల 24న తొలి కౌన్సెలింగ్ నిర్వహించి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**సీహెచ్‌సీ నుంచి జిల్లా ఆస్పత్రి వరకు..**

నర్సంపేట పట్టణంలో 1999లో సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)ని 50 పడకలతో ప్రారంభించారు. అనంతరం మాతాశిశు సంక్షేమం కింద మరో 20 పడకలను పెంచారు. క్రమంగా ఆస్పత్రిలో రోగుల సంఖ్య పెరగడంతో మరో 30 పడకలు వరండాలు, ఇతర ప్రదేశాల్లో వేసి రోగులకు సేవలు అందిస్తున్నారు. డిసెంబర్ 2021 నర్సంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా మరిన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారే తప్ప భవనం, ఇతర సదుపాయాలు కల్పించకపోవడంతో కొంతమేరకు ఇబ్బందులు కలిగాయి. దాత దొడ్డ మోహన్‌రావు కొనుగోలు చేసి ప్రభుత్వానికి అప్పగించిన స్థలంలో నూతన భవనాన్ని నిర్మించాలని అప్పటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పట్టుబట్టి నిధులను మంజూరు చేయించారు. మొదట మూడు బ్లాక్‌లకే పరిమితి చేసి, 250 పడకల ఆస్పత్రి నిర్మిస్తామని పనులు ప్రారంభించారు.


**కలెక్టర్, ఎమ్మెల్యే చొరవతో..**

జిల్లాకు ఒక వైద్య కళాశాలలో భాగంగా వరంగల్ జిల్లాకు ఆస్పత్రి మంజూరైంది. నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రికి అనుసంధానంగా వైద్య కళాశాల ఉండాలని పెద్ది సుదర్శన్‌రెడ్డి నివేదించడంతో 2023లో ప్రభుత్వం వైద్య కళాశాలను మంజూరు చేసింది. మొదట 100 సీట్లతో కళాశాలను ప్రారంభిస్తామని హామీ ఇచ్చింది. అయితే, ఎన్ఎంసీ పలుమార్లు ఆస్పత్రి పనులను తనిఖీ చేసింది. ఈక్రమంలో పనుల్లో వేగం పెంచారు. కొత్త భవనంలోని ఒక బ్లాక్‌లో జిల్లా ఆస్పత్రి, మరో బ్లాక్‌లో కళాశాల ఏర్పాటుచేసి ఈ ఏడాది కళాశాలను ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రభుత్వం 100 సీట్లను కుదిస్తూ 50 సీట్లకే పరిమితం చేసింది. రెండు నెలల క్రితం జిల్లా ఆస్పత్రిని జాతీయ వైద్య మండలి తనిఖీ చేసింది. మౌలిక వసతులు లేకపోవడంతో ఈ విద్యా సంవత్సరానికి వైద్య కళాశాలకు అవకాశం లేదని తేల్చి చెప్పింది. కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను విధుల్లోకి తీసుకొని కళాశాల ప్రారంభానికి మార్గం సుగమం చేశారు. దీంతో ఎన్ఎంసీ నర్సంపేట వైద్య కళాశాలకు పచ్చ జెండా ఊపింది. ఈనెల 24న మొదటి కౌన్సెలింగ్ అనంతరం విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు.

**వారం రోజుల్లో ఓపీ సేవలు ..**

జిల్లా ఆస్పత్రి, మెడికల్ కళాశాల భవనాలను తాత్కాలికంగా ప్రారంభించి, ట్రాయల్ రన్‌గా వారం రోజుల్లో ఓపీ సేవలను అందుబాటులోకి తెస్తారు. ఇటీవల కలెక్టర్ సత్యశారద ఆస్పత్రిని తనిఖీ చేశారు. జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు అందించేందుకు నూతన భవనంలో ఆగస్టు 1 నుంచి ట్రయల్ రన్ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. భవనం పనులు పూర్తి చేసి సంబంధిత కాంట్రాక్టర్ అప్పగించేలా చొరవ తీసుకోవాలని సూచించారు. ట్రయల్ రన్ వైద్య సేవలు ఆలస్యంగా మరో వారం రోజుల్లో ప్రారంభంకానున్నాయి.

**ఈ ఏడాది కళాశాల ప్రారంభిస్తాం..**



ఈ విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభించేందుకు జాతీయ వైద్య మండలి అనుమతులు ఇవ్వడం హర్షణీయం. డీఎంఈ, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పనులు వేగవంతం చేశాం. సమష్టి కృషితోనే నర్సంపేట వైద్య కళాశాలను ఈ ఏడాది ప్రారంభించనున్నాం. చిన్న చిన్న సమస్యలను అధిగమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, విద్యార్థులకు మెరుగైన విద్య అందించేలా కృషి చేస్తాం.

– డాక్టర్ మోహన్‌దాస్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

# పారదర్శకంగా పనులు చేయించాలి

సంగెం: ఉపాధి హామీ పనులు పారదర్శకంగా చేయించాలని డీఆర్డీఓ కౌసల్యాదేవి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈజీఎస్ పనులపై శుక్రవారం 15వ విడత సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, ఎస్సార్పీ చెన్నకేశవులు, క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఈఈ హరీష, డీవీఓ పద్మనాభరెడ్డి, ఏపీఓ గణేశ్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పశువులకు వ్యాక్సిన్ వేయించాలి

- పశుసంవర్ధక శాఖ ఏడీ బీఎస్.రెడ్డి

ఖానాపురం: పశువులకు తప్పకుండా వాక్సిన్ వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ బీఎస్.రెడ్డి రైతులకు సూచించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం పాడిపశువుల లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిపశువులకు 70 శాతం పచ్చిగడ్డి, 30 శాతం ఎండుగట్టి పెట్టినప్పుడే పాల దిగుబడి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ముర్రా, గ్రేడ్ ముర్రా జాతి గేదెలు అధికంగా పాలు ఇస్తాయని పేర్కొన్నారు. ఎదకువచ్చిన సమయంలో స్థానిక దున్నలతో క్రాసింగ్ చేయించకుండా ఆర్టిఫిషియల్ ఇన్సిమేషన్ చేయిస్తే మంచి సంతతి తయారవుతుందన్నారు. జెర్సీక్రాస్ బ్రీడ్ ఆవులతో మంచి పాలదిగుబడి వస్తుందని వివరించారు. ఆర్థికంగా బలోపేతం కావడానికి పాడిపశువుల పెంపకం మంచి అవకాశమని చెప్పారు. డీపీఎం సరిత, పశువైద్యాధికారి శ్రీలక్ష్మి, ఏపీఎం కందిక సుధాకర్, సీసీలు కరుణ, నర్సయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పోలీసుల పేరుతో ఘరానా మోసం

- మీ సేవ నిర్వాహకుడికి కుచ్చుటోపి
- రూ.90వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

**కాళేశ్వరం:** జయశంకర్ జిల్లా మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన ఓ మీసేవ నిర్వాహకుడికి పోలీసులమంటూ ఫోన్‌కాల్ చేసి కుచ్చుటోపి పెట్టి నగదు దోచుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఓ ఏఎస్సై పేరుతో సైబర్ నేరగాడు మీసేవ నిర్వాహకుడికి ఫోన్ చేశాడు. తన భార్య అనారోగ్యంతో ఉందని, ఆస్పత్రి ఖర్చుల కోసం వెంటనే రూ.90వేలు ట్రాన్స్‌ఫర్ చేయాలని మీసేవ నిర్వాహకుడితో ఆవేదన వ్యక్తం చేస్తూ మాట్లాడాడు. జిల్లా స్థాయి ఉన్నతాధికారి ఫోన్ కాల్‌లో లైన్‌లో ఉన్నాడని చెప్పాడు. దీంతో స్పందించిన నిర్వాహకుడు రూ.90వేల నగదును వారు చెప్పిన నంబర్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. వెంటనే ఆసైబర్ నేరగాడు ఫోన్‌కాల్ కట్ చేసి, స్విచ్చాఫ్ చేశాడు. దీంతో బాధితుడు మోసపోయానని గమనించి, మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ క్రైం 1930లో కేసు నమోదు చేశాడు. అయితే ఇదంతా గత నెల 28న జరగా.. ఆలస్యంగా వెలుగులోకొచ్చింది.

### కూలీ ప్రాణం తీసిన ఎలక్ట్రిక్ రంపం

**చిట్యాల:** చెట్లు, దుంగలను కట్ చేసేందుకు ఉపయోగించే ఎలక్ట్రిక్ రంపం ఓ కూలీ ప్రాణం తీసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గోపాలపూర్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి, గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాదువెల్లి పైడయ్య(55) అదే గ్రామానికి చెందిన బోగం భద్రయ్య ఇంటి వద్ద ఉన్న అల్లనేరేడు చెట్టును తొలగించేందుకు సాయంత్రం వెళ్లాడు. ఎలక్ట్రిక్ రంపం సాయంతో చెట్టును తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు రంపం పైడయ్య ఛాతికి తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. పైడయ్యకు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, పైడయ్య మృతదేహాన్ని సివిల్ ఆస్పత్రికి తరలించారు.

### వైబ్రెంట్ 'అకాడమీ'కి షోకాజ్ నోటీస్

**విద్యారణ్యపురి:** హనుమకొండ నక్కలగుట్ట ప్రాంతంలోని వైబ్రెంట్ అకాడమీ యాజమాన్యానికి షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు డీఐఈఓ గోపాల్ శుక్రవారం తెలిపారు. వైబ్రెంట్ అకాడమీ హాస్టల్‌లో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందిందనే సమాచారంతో అక్కడికి వెళ్లి పరిశీలించామన్నారు. వైబ్రెంట్ అకాడమీ జూనియర్ కళాశాల కాదని, దీనికి ఇంటర్ బోర్డు నుంచి అనుమతి లేదన్నారు. అకాడమీలో ఇంటర్మీడియట్ తరగుతులు నిర్వహించకూడదన్నారు. సంబంధిత వైబ్రెంట్ అకాడమీ యాజమాన్యానికి షోకాజ్ నోటీస్ ఈనెల 1న సాయంత్రం జారీ చేశామన్నారు. వెంటనే వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీస్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. వైబ్రెంట్ అకాడమీలో విద్యార్థి మృతి ఘటనపై ఇంటర్ బోర్డ్ సెక్రటరీకి ప్రాథమిక రిపోర్ట్ పంపామన్నారు. ఎఫ్ఐఆర్ కాపీ, వైబ్రెంట్ అకాడమీ యాజమాన్యం వివరణను బట్టి తుది రిపోర్టును కూడా ఇంటర్‌బోర్డ్ సెక్రటరీకి పంపనున్నట్లు డీఐఈఓ గోపాల్ వివరించారు.



# భద్రత మెరుగుపడేనా?

**కేయూలో నూతన సెక్యూరిటీ సర్వీస్**
- వర్సిటీ పరిధిలో 133మంది సెక్యూరిటీ గార్డులు
- ఆరుగురు సూపర్‌వైజర్లు, ఒక సెక్యూరిటీ ఆఫీసర్
- తొలిసారిగా మహిళా సెక్యూరిటీ గార్డులు


కేయూ నూతన సెక్యూరిటీ గార్డులు

**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీలో నూతన సెక్యూరిటీ సర్వీస్ అందుబాటులోకి వచ్చింది. గత కొన్నేళ్లుగా ఒకే సంస్థ ఆధ్వర్యంలో సెక్యూరిటీ సర్వీస్‌ను నిర్వహిస్తూ వస్తున్నారు. ఎట్టకేలకు కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ అప్రూవల్ మేరకు నూతన సెక్యూరిటీ సర్వీసెస్ కోసం ఇటీవల కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి టెండర్లు పిలిచి, ఇండస్ట్రియల్ డిటెక్టీవ్ సెక్యూరిటీ సర్వీసెస్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈనెల 1వ తేదీ నుంచి నూతన సెక్యూరిటీ సర్వీస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

**133మంది సెక్యూరిటీ గార్డులు**

కాకతీయ యూనివర్సిటీలో క్యాంపస్, హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, మహిళా, యూనివర్సిటీ పీజీ, యూనివర్సిటీ లా కాలేజీ వద్ద భద్రత కల్పించడంతోపాటుగా వర్సిటీ పరిధిలోని కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీ, ఖమ్మం యూనివర్సిటీ పీజీ కాలేజీలోనూ ఈసెక్యూరిటీ గార్డులు తమ విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇందుకోసం 133మంది సెక్యూరిటీ గార్డులు, ఆరుగురు సూపర్‌వైజర్ల నియామకానికి అనుమతి లభించింది. వీరిని ఓ రిటైర్డ్ పోలీస్ అధికారి సెక్యూరిటీ ఆఫీసర్‌గా పర్యవేక్షిస్తారు.

**వర్సిటీ భద్రతా వ్యయం రూ.17లక్షలు**

కాకతీయ యూనివర్సిటీలో సెక్యూరిటీ గార్డులుగా విధులను నిర్వర్తించేవారికి నెలకు రూ.11,216, సూపర్ వైజర్లకు ఒక్కొక్కరికీ రూ.12,216 వేతనాలాగా సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ ద్వారా యూనివర్సిటీ చెల్లించనుంది. అలాగే సెక్యూరిటీ ఆఫీసర్‌కు నెలకు రూ.30వేలు చెల్లిస్తున్నారు. ఏజెన్సీ సంస్థకు ప్రతినెలా సర్వీస్ చార్జెస్‌గా సొమ్మును యూనివర్సిటీ చెల్లించనుంది. మొత్తంగా కాకతీయ యూనివర్సిటీ ప్రతినెలా భద్రత కోసం రూ.17లక్షల వరకు ఖర్చు చేయనున్నట్లు అంచనా. అలాగే సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లకు వర్సిటీ ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించనుంది.

**మహిళా సెక్యూరిటీ గార్డులు..**

కాకతీయ యూనివర్సిటీ ఆవిర్భావం నుంచి సెక్యూరిటీ వ్యవస్థ ఉంది. అయితే యూనివర్సిటీ చరిత్రలో తొలిసారిగా 12 మంది మహిళా సెక్యూరిటీ గార్డులను నియమించారు. క్యాంపస్‌లో వివిధ కోర్సుల్లో విద్యార్థునుల సంఖ్య పెరిగింది. వివిధ హాస్టళ్లలో విద్యార్థినులు వందలాది మంది వసతి పొందుతున్నారు. ఈనేపథ్యంలో మహిళా హాస్టళ్ల వద్ద మహిళా సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వర్తించనున్నారు. ఏదైనా సమస్యతో విద్యార్థినులు ఆందోళన చేసినప్పుడు కూడా మహిళా సెక్యూరిటీగార్డుల అవసరం ఏర్పడుతుందని భావిస్తున్నారు.

**తొలిరోజు విధుల్లోకి 40మంది..**

ఆగస్టు 1వ తేదీ నుంచి నూతన సెక్యూరిటీ సర్వీస్ అందుబాటులోనికి తీసుకొచ్చారు. గతంలో పనిచేస్తున్నవారిలో కొందరిని తొలగించారు. పలువురిని మాత్రం ఈసంస్థ ద్వారానే విధుల్లోకి తీసుకున్నారు. తొలిరోజు 40మందిని మాత్రమే విధుల్లోకి తీసుకున్నారు. వీరికి కేయూ స్పోర్ట్స్ బోర్డు మైదానంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి భద్రతపై పలు సూచనలు చేశారు. సెక్యూరిటీ గార్డులు మూడు షిఫ్ట్‌లో తమకు కేటాయించిన పాయింట్ల వద్ద విధులు నిర్వర్తించనున్నారు.

**గతంలో అనేక సమస్యలు..**

యూనివర్సిటీ క్యాంపస్‌లో గతంలో పలుసార్లు వివిధ చోరీలు జరిగాయి. ప్రధానంగా ఆడిటోరియంలో రెండుసార్లు రూ.లక్షలు విలువ చేసే ఎలక్ట్రానిక్ వస్తువులు వైర్లు, ఏసీలకు సంబంధించిన సామగ్రి అపహరణకు గురైంది. సెక్యూరిటీ వ్యవస్థ ఉన్నప్పటికీ క్యాంపస్‌లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా నియంత్రించలేకపోయారనే ఆరోపణలు ఉన్నాయి. క్యాంపస్‌లో పలుచోట్ల రాత్రివేళ మద్యం సేవించి అక్కడే బాటిళ్లు పడేసిన సందర్భాలు ఉన్నాయి. బయటవారు కూడా క్యాంపస్‌లోనికి యథేచ్ఛగా వస్తుంటారు. ఈక్రమంలో నూతన సెక్యూరిటీ గార్డులు క్యాంపస్‌లోకి వచ్చే ప్రతిఒక్కరినీ విచారించిన తర్వాతనే లోనికి అనుమతించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు పలువురి నుంచి వ్యక్తమవుతున్నాయి.

**క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి**



యూనివర్సిటీలో ఎంపిక చేసిన విభాగాల వద్ద సెక్యూరిటీ గార్డులు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తారు. అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని వారికి సూచించాం. కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీ, ఖమ్మం పీజీ కాలేజీకి అక్కడివారినే సెక్యూరిటీ గార్డులుగా నియమించాలని టెండర్ దక్కించుకున్న సెక్యూరిటీ సర్వీస్ సంస్థను కోరాం.

– ఆచార్య మల్లారెడ్డి, కేయూ రిజిస్ట్రార్

# ఏసీబీకి పట్టుబడిన పర్వతగిరి ఎస్సై

- రూ.40వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు


పట్టుబడిన ఎస్సై వెంకన్న, డ్రైవర్ సదానందం

**పర్వతగిరి:** వరంగల్ జిల్లా పర్వతగిరి ఎస్సై గుగులోతు వెంకన్న శుక్రవారం వరంగల్ ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 27వ తేదీ శనివారం పర్వతగిరి ఎస్సై గుగులోతు వెంకన్న ఆధ్వర్యంలో పెట్రోలింగ్ చేస్తుండగా మండలంలోని అన్నారం షరీఫ్ రోడ్డు వద్ద బెల్లంలోడుతో వెళ్తున్న వ్యానును పట్టుకున్నారు. బెల్లం లోడ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి వాహన యజమాని భాస్కర్, డ్రైవర్ రాకేశ్, వర్కర్ రవిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. కేసు నమోదు అనంతరం జ్యుడీషియల్ కస్టడీ లేదా 35క్లాస్ బీఎన్ఎస్ఎస్ నోటీసులు ఇవ్వాల్సి ఉండగా అవి ఏమీ చేయకుండా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నారు. ఇలా ఎందుకు తిప్పుకుంటున్నారని బాధితులు వారి మిత్రుడు అజ్మీరా వెంకట్ ద్వారా ఎస్సై గుగులోతు వెంకన్నను అడిగిస్తే.. స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, అందుకు రూ.70వేలు ఇవ్వాలని ఎస్సై డిమాండ్ చేశారు. ఇందులో రూ.20వేలు ఆదివారం రోజున ఎస్సై చెప్పిన నంబర్‌కు ఫోన్ పే ద్వారా బాధితులు పంపించారు. మిగతా రూ.50వేలు ఇస్తేనే 35క్లాస్ బీఎన్ఎస్ఎస్ నోటీసులు ఇస్తానని ఎస్సై చెప్పడంతో అంగీకరించిన బాధితులు కొంత సమయాన్ని కోరి ఎస్సైని ఎలాగైనా ఏసీబీకి పట్టించాలని నిర్ణయించుకున్నారు. ఫోన్ ద్వారా వరంగల్ ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ ప్లాన్ ప్రకారం డబ్బులు ఇచ్చే ముందు తమకు సమాచారం ఇవ్వాలని బాధితులకు తెలిపి సమయానికి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. బాధితులు డబ్బులు ఎవరికి ఇవ్వాలని ఎస్సైని అడగగా ఎస్సై డ్రైవర్ సదానందానికి ఇవ్వాలని సూచించడంతో డ్రైవర్ సదానందానికి నగదు ఇస్తున్న క్రమంలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఎస్సై వెంకన్న చెబితేనే డబ్బులు తీసుకున్నట్లు డ్రైవర్ సదానందం అంగీకరించాడు. దీంతో ఎస్సై వెంకన్నతోపాటు డ్రైవర్ సదానందంపై కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకుని శనివారం ఉదయం ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. దాడుల్లో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్లు ఎల్.రాజు, ఎస్.రాజు, శ్యాంసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

**దండించడమే కారణమా?**

వారం రోజుల క్రితం నల్లబెల్లం వ్యానును పట్టుకున్న ఎస్సై వెంకన్న స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు మధ్యవర్తి ద్వారా రూ.70వేలకు అంగీకరించినప్పటికీ పట్టుబడిన వారిలో మైనర్ బాలుడు, మరో వ్యక్తిని తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. దీంతో సదరు మధ్యవర్తి.. ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు తెలిసింది.

# అమెరికా ప్రమాద మృతుడి అంత్యక్రియలు పూర్తి

- కుమారుడికి తలకొరివి పెట్టిన తండ్రి
- కన్నీటిసంద్రంలో కుటుంబ సభ్యులు, బంధువులు


రోహిత్‌రెడ్డి(ఫైల్)


కొడుకుకు తలకొరివి పెడుతున్న తండ్రి

**కురవి:** తమ కుమారుడు పెద్ద చదువులు చదివి ఉన్నత ఉద్యోగం చేస్తూ మలివయసులో ఆసరాగా ఉంటాడని భావించిన ఆ తల్లిదండ్రులకు శోకమే మిగిలింది. మానుకోట జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామానికి చెందిన బండి అనిల్‌రెడ్డి కుమారుడు బండి రోహిత్‌రెడ్డి(27) అమెరికాలో ఉంటూ ఉన్నత విద్యనభ్యసిస్తూ, ఉద్యోగం చేస్తున్నాడు. ఈఏడాది ఏప్రిల్ 14న అమెరికాలోని టెక్సాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో రోహిత్‌రెడ్డి తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ జూలై 24న మృతి చెందాడు. దీంతో రోహిత్‌రెడ్డి మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరుకోగా.. కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. కుమారుడికి తండ్రి అనిల్‌రెడ్డి తలకొరివి పెట్టాడు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బండి వెంకటరెడ్డి పాడెమోశాడు.

# వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేర్వేరు కారణాలతో శుక్రవారం ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ప్రమాదంలో అల్లుడు మృతి చెంది, కుమార్తె ఆస్పత్రి పాలైందని దివ్యాంగుడైన తండ్రి మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడగా.. వివాహం కావడంలేదని ఓ యువకుడు, కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి తనువు చాలించారు.**

**మనస్తాపంతో దివ్యాంగుడు..**


అజ్మీరా కిషన్(ఫైల్)


**కురవి:** ఆర్థిక ఇబ్బందులకు తోడు వివిధ కారణాలతో మనస్తాపానికి గురై దివ్యాంగుడైన రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీరోలు ఎస్సై విజయ్‌రాం కుమార్, తండావాసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా సీరోలు మండలం తాళ్లసంకీస శివారు వస్రాం తండా జీపీ పరిధిలోని ఊక్ల తండాకు చెందిన అజ్మీరా కిషన్ (56)కు ఇద్దరు కుమార్తెలు స్వరూప, శైలజ, ఒక కుమారుడు సాగర్ ఉన్నారు. రెండు నెలల క్రితం కురవిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని దర్శించుకుని ఇల్లందుకు వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వరూపకు తీవ్రగాయాలు కాగా, అల్లుడు సురేశ్ మృతి చెందాడు. స్వరూప తీవ్రగాయాలతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలోనే దివ్యాంగుడైన కిషన్‌కు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మనస్తాపానికి గురై జూలై 31వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించగా.. శుక్రవారం మృతి చెందాడు. భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీరోలు ఎస్సై విజయ్‌రాం కుమార్ తెలిపారు.

**కుటుంబ కలహాలతో వ్యక్తి..**

**ఎల్కతుర్తి:** భార్యపై అనుమానం, కుటుంబ కలహాలతో తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాలపడిన ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారం గ్రామానికి చెందిన దండం రాజు(27)కు ఎనమిది ఏళ్ల క్రితం రవళితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. కాగా భార్యపై అనుమానంతో రాజు తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో రవళి ఇటీవల చిట్టీ డబ్బులు చెల్లించేందుకు కొత్తకొండకు వెళ్లగా భార్యను అనుమానించి రాజు గొడవపడి కొట్టాడు. దీంతో గత నెల 25న రవళి పుట్టింటికి వెళ్లింది. అనంతరం రాజు తన భార్య రవళికి ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరినప్పటికీ ఆమె పట్టించుకోలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన రాజు గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజు తల్లి లింగవ్వ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


రాజు మృతదేహం

**పెళ్లి కావడం లేదని యువకుడు..**


మహేశ్(ఫైల్)

**వేలేరు:** హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన యువకుడు గంగాపురం మహేశ్(29) తనకు పెళ్లి కావడం లేదనే బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంగాపురం మల్లయ్యకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది. పెద్ద కుమారుడు, కూతురికి వివాహం కాగా చిన్న కుమారుడికి పెళ్లి కాలేదు. పెళ్లి సంబంధాలు చూస్తున్న కూడా ఎక్కడ కుదరడం లేదు. తన మిత్రులకు పెళ్లి అవుతుందని, తనకు కావడం లేదనే బాధతో గురువారం సాయంత్రం తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహేశ్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# లక్నవరం.. మరింత కనువిందు

- ఎకో టూరిజంలో భాగంగా పలు అభివృద్ధి పనులు
- కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్


సస్పెన్షన్ బ్రిడ్జిపై అధికారులతో ప్రభాకర్

**గోవిందరావుపేట:** ములుగు జిల్లా గోవిందరావుపేట మండల పరిధిలోని లక్నవరం సరస్సు వద్ద ఉన్న అటవీ ప్రాంతాన్ని శుక్రవారం కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్, ములుగు జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, సంయుక్తంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ..పర్యాటకులకు మరింత కనువిందు చేసేలా ఎకో టూరిజంలో భాగంగా లక్నవరం అడవిలో నైట్ క్యాంపింగ్ సైట్, తూముల పరిసరాల్లో వివిధ రకాల ఆక్టివిటీస్ ఏర్పాటుతోపాటు పలు అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో పస్రా రేంజ్ ఆఫీసర్ మాధవీలత, సెక్షన్ ఆఫీసర్ వేణుగోపాల్, బీట్ ఆఫీసర్ దీప్‌లాల్ తదితరులు ఉన్నారు.

# వర్గీకరణ ఉద్యమానికి న్యాయం చేసిన సుప్రీంకోర్టు

- డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ


సంబురాలు జరుపుకుంటున్న నాయకులు

**హన్మకొండ:** ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు సంచలనమైన, న్యాయమైన తీర్పు ఇచ్చిందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన సందర్భంగా శుక్రవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి అభిషేకం చేశారు. పూలమాల వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెరుమాండ్ల మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ విద్యార్థి నాయకుడిగా, రాష్ట్ర డాక్టర్స్ ఫోరం కన్వీనర్‌గా పని చేసినందుకు గర్వంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ సుప్రీం కోర్టు ఆదేశాలివ్వడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్యా ఉద్యోగాల్లో వర్గీకరణ అవసరమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, సునీల్ ఎనలేని కృషి చేశారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణకు సానుకూలత వ్యక్తం చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, భాస్కర్, గొర్రె మహేందర్, డాక్టర్ రమేశ్, బీమా, వినయ్ కుమార్, రమేశ్, కుంజాకర్ రాకేశ్, మేరీ, సుకన్య, సుధాకర్, పూర్ణ, స్వప్న, రాజేశ్, సంగీత్ పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అస్వస్థత

- విషపురుగు కాటు వేసిందని తల్లిదండ్రులకు చెప్పిన వైద్యులు


విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తరలిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

**ములుగు రూరల్:** ములుగు జిల్లా బండారుపల్లి గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ఇద్దరు అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కార్తీక్, ప్రణయ్‌లు గంట వ్యవధిలో అస్వస్థతకు గురికాగా చికిత్స నిమిత్తం ఉపాధ్యాయులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విద్యార్థులకు వైద్యులు చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న తల్లితండ్రులు.. వైద్యులను విద్యార్థుల అస్వస్థతపై అడగగా విషపురుగుల కాటుకు గురై ఉండవచ్చని తెలిపారు. కాగా, ఆ ఇద్దరు విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హనుమకొండ శివారులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారని, ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ విషయంపై పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. కాగా, విద్యార్థులను కాటు వేసింది విషపురుగా, పామునా, మరేమైనా జరిగిందా.. అన్నది స్పష్టత రావడం లేదు.

# ట్రాన్స్‌ఫార్మర్ల డిజిటలైజేషన్ వేగంగా చేయాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

**హన్మకొండ:** విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, నోడల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డివిజన్లు, జిల్లాల వారీగా ప్రగతి, విద్యుత్ అంతరాయాలపై సమీక్షించారు. అంతరాయాలు, బ్రేక్ డౌన్లు, ట్రిప్పింగ్స్ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, లైన్ల పెట్రోలింగ్, సబ్ స్టేషన్ల నిర్వహణ, ట్రాన్స్‌ఫార్మర్ల ముందస్తు నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ దిశగా కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళ్లాలని, విద్యుత్ అంతరాయాలను కనిష్ట స్థాయికి తీసుకురావాలన్నారు. షెడ్యూల్ మెయింటనెన్స్‌ను యాప్‌లో పొందుపరచాలని తెలిపారు. దశల వారీగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సబ్ స్టేషన్లను మానవ రహిత సబ్ స్టేషన్లగా రూపాంతరం చేస్తున్నట్లు చెప్పారు. ఆ తర్వాత మున్సిపల్ పరిధిలోని సబ్ స్టేషన్లను చేస్తామని వివరించారు. భారీ వర్షాలు, ఈదురుగాలులు, సాంకేతికంగా విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తినప్పుడు ప్రత్యామ్నాయ సరఫరా కోసం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ-స్టోర్స్ విధానాన్ని ప్రవేశపెట్టడం వలన వినియోగదారుల పనులు సకాలంలో పూర్తి అవుతాయన్నారు. నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ పూర్తిస్థాయి నిబద్ధతతో పని చేస్తూ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలనందించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, టి.మధుసూదన్, సీజీఎంలు కె.తిరుమల్‌రావు, కె.కిషన్, రాజు చౌహాన్, కె.ఎస్.గుట్ట, జీఎంలు గౌతమ్ రెడ్డి, నాగప్రసాద్, శ్రీనివాస్, డీఈ శ్రీధరాచారి పాల్గొన్నారు.

# బడికి తీసుకెళ్లే బస్సే బలితీసుకుంది

- వెనుక టైర్ల కిందపడి విద్యార్థి దుర్మరణం
- బస్సు అద్దాలు ధ్వంసం చేసిన విద్యార్థి బంధువులు, గ్రామస్తులు


వరుణ్ తేజ (ఫైల్)


విద్యార్థి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

**జనగామ రూరల్:** ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకునేలోపే రోజూ తనను తీసుకెళ్లే స్కూల్ బస్సు ఆ విద్యార్థి ప్రాణం తీసింది. ఈ ఘటన జనగామ జిల్లా అడవికేశవాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ గణేష్, మంజుల దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు బానోత్ వరుణ్ తేజ (6) జనగామ పట్టణంలోని సిద్దిపేట రోడ్డులో గల గౌతమి మోడల్ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. రోజుమాదిరిగానే శుక్రవారం ఉదయం పాఠశాలకు స్కూల్ బస్‌లో వెళ్లాడు. పాఠశాల ముగిసిన తరువాత సాయంత్రం బస్సు గ్రామానికి చేరుకుంది. వరుణ్‌తేజ బస్సుదిగి ఇంటికి వెళ్తుండగా డ్రైవర్ మహేందర్ గమనించకుండా రివర్స్ తీసి ముందుకెళ్తుండగా పక్కనే ఉన్న వరుణ్‌తేజ వెనుకటైర్‌కింద పడడంతో తలపగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి బంధువులు, గ్రామస్తులు ఆగ్రహంతో బస్సు అద్దాలు ధ్వంసం చేశారు. ఘటనాస్థలానికి సీఐ రఘు చేరుకుని విచారణ చేపట్టారు. బాలుడి తల్లిదండ్రులు విలపించిన తీరు స్థానికులు కంటపడి పెట్టించింది. గ్రామంలో ఆందోళన నిర్వహించారు.

# పంటల సాగులో మెళకువలు పాటించాలి

- కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న


సందేహాలను నివృత్తి చేస్తున్న డాక్టర్ రాజన్న

**మామునూరు:** ఖరీఫ్ పంటల సాగుల్లో మెళకువలు పాటించడం, ప్రధాన పంటలకు పట్టిన చీడపీడ పురుగు వదిలించేందుకు తీసుకునే చర్యలతో రైతులు మెరుగైన దిగుబడి సాధించవచ్చని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండల కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఫోన్ ఇన్ కార్యక్రమంలో చీడపీడల నివారణ చర్యలు, ఇతర యాజమాన్య పద్ధతులపై రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు.